శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



టన్ను చీనీ రూ.15,500
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీ కాయలు గరిష్టంగా రూ.15,500, కనిష్టంగా రూ.7 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.30
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టం రూ.24 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,250 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
33.6°/21.4°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి
- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



గ్రామ సరిహద్దు మ్యాప్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్/రాప్తాడు రూరల్: ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీఓలు, ఎస్‌డీసీలు, తహసీల్దార్లు, సర్వే ఏడీ, మండల సర్వేయర్లు, తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారులు 544డీ, 47, 42, 155 తదితర ప్రాజెక్టులకు భూసేకరణ, భూ బదలాయింపు ప్రక్రియలో జాప్యానికి తావివ్వకూడదని ఆదేశించారు. రీ–సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. 'అన్నదాత సుఖీభవ' సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో గ్రామ సరిహద్దు రాయిని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఏపీ ప్రత్యేక రక్షణ దళం (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) కార్యాలయ భవనం, శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ఉప్పరపల్లి గ్రామ సర్వే నంబర్ 19–8లో 2.50 ఎకరాల భూమిని పరిశీలించారు. జేసీ వెంట ఆర్డీఓ కేశవ నాయుడు, తహసీల్దార్ మోహన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

క్వాంటం కంప్యూటింగ్‌తో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: క్వాంటం కంప్యూటింగ్‌తో విప్లవాత్మకమైన మార్పులు రానున్నాయని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత పేర్కొన్నారు. క్వాంటం వ్యాలీ హ్యాకథాన్–2025 ఇంటర్నల్ సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్వాంటం కంప్యూటింగ్‌తో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా తదితర రంగాల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకోనున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీలకు మించి సంక్లిష్ట సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, క్వాంటం సెన్సార్‌లతో వివిధ రంగాల్లో మార్పు అనివార్యమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ ఈ. రమేష్ బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, అసిస్టెంట్ రిజిస్ట్రార్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లు.. యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి టౌన్: వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపి మేరకు.. తాడిపత్రి మండలం పులిప్రొద్దుటూరుకు చెందిన దూదేకుల దస్తగిరి కుమారుడు హాజీవలి (35) ఐచర్ వాహనాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య ముంతాజ్‌బేగం ఉన్నారు. ఐచర్ వాహనం కొనుగోలు కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద రూ. 14 లక్షల వరకు అప్పు చేశాడు. వాహనానికి సరైన అద్దెలు లేకపోవడంతో అప్పులు తీర్చే మార్గం కానరాక ఇబ్బంది పడేవాడు. ఈ క్రమంలోనే వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో మనస్తాపం చెందిన హాజీవలి బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు గురువారం కూడా కొనసాగాయి. డీఎస్పీ ఎం.నాగభూషణం, సీఐలు కే శ్రీనివాసులు తదితరులు ఆరు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రూ.1.82 లక్షల విలువైన 6.85 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు నిలుపుదల చేస్తూ నోటీసులు ఇచ్చారు.

రెఫరల్ దందా

కూడేరు మండలం కలగల్లకు చెందిన రాముడు అనే 65 ఏళ్ల వ్యక్తి అనారోగ్యంతో ఇటీవల అనంతపురం నగరంలో సంగమేష్ సర్కిల్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లాడు. ఇక్కడి డాక్టర్లు వారం రోజులు వైద్యం చేసి చేతులెత్తేశారు. దీంతో ఆయనను కుటుంబీకులు బెంగుళూరు తీసుకెళ్లారు. ఇప్పటికే అనంతపురంలోని ఆస్పత్రిలో రూ.65 వేల బిల్లయ్యింది. ఇప్పుడు బెంగుళూరులో ఎంత ఖర్చవుతోందోనని కుటుంబ సభ్యులు భయపడుతున్నారు.

బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన మురళి ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు ఆయనను సాయినగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నాలుగు రోజుల చికిత్సకు రూ. లక్ష ఖర్చయ్యింది. అయినా మురళి ఆరోగ్యంలో మార్పు లేదు. దీంతో మురళిని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు ఆయన కుటుంబ సభ్యులకు సూచించారు. అక్కడి డాక్టరు పేరు, ఫోన్ నంబరును పేపరులో రాసి ఇవ్వడం గమనార్హం.



- ఆస్పత్రుల మాయాజాలం
- జిల్లా వైద్యులతో మెట్రో సిటీల్లోని ఆస్పత్రుల నిర్వాహకుల సమావేశాలు
- పర్సెంటేజీలపై ఖరీదైన హోటళ్లలో మంతనాలు
- ఒక్కో సర్జరీకి 30 నుంచి 40 శాతం సొమ్ముతో ఎర
- రూ. లక్షల్లో నష్టపోతున్న రోగులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద రోగులను బెంగళూరు, హైదరాబాద్ తదితర మెట్రో సిటీల్లోని కార్పొరేటర్ ఆస్పత్రులు వెంటాడుతున్నాయి. ఎలాగైనా సరే రోగిని తమ ఆస్పత్రులకి రప్పించుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. జిల్లాకు చెందిన పలువురు డాక్టర్లతో 'రెఫరల్' దందా సాగిస్తున్నాయి. ఆరోగ్య శ్రీ పథకం పరిధిలో ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సరిగా వైద్యం చేయకపోవడం, ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న రోగులను చివరి నిమిషంలో తాము ముందే మాట్లాడుకున్న వైద్యుడి దగ్గరకు పంపడం తాజాగా వెలుగు చూసింది.

హైదరాబాద్ వైద్యుల క్యూ..

రాష్ట్రంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి పరంగా వెనుకబడిందనే విషయం తెలిసిందే. ఈ విషయాన్నే హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రుల వారు ఆసరాగా మార్చుకున్నారు. అనంతపురంలో ఖరీదైన హోటల్‌గా చెప్పుకునే మాసినేని గ్రాండ్‌లో నెలలో కనీసం 10 నుంచి 13 సమావేశాలు హైదరాబాద్ కార్పొరేట్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని వైద్యులందరూ ఈ సమావేశాలకు హాజరవుతున్నారు. హైదరాబాద్ నుంచి అన్ని విభాగాల వైద్యులూ ఒకేసారి రావడం లేదు. ఆర్థోపెడిక్, కార్డియాలజీ, ఎండోక్రినాలజీ, గైనిక్ ఇలా ఒక్కొక్క విభాగం ఆధ్వర్యంలో ఒక్కోసారి మీటింగ్ పెడుతున్నారు. ఆ విభాగానికి చెందిన అనంతపురం జిల్లా వైద్యులందరినీ సమావేశానికి పిలిపిస్తున్నారు. 'రోగులను మా వద్దకు పంపించండి.. మీకెంత కావాలో అడగండి' అంటూ ఎర వేస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా ఆ రోగికి ఆస్పత్రిలో అయ్యే బిల్లులో 30 నుంచి 40 శాతం సొమ్మును రెఫర్ చేసిన వైద్యుడికి ముట్టజెబుతున్నారు.

కిడ్నీ, గుండె జబ్బుల రోగులు ఎక్కువ

ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువగా కిడ్నీ, గుండె జబ్బులు, న్యూరో రోగులను హైదరాబాద్ పంపిస్తున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో ఆరోగ్యశ్రీ పథకం వర్తించదు. దీంతో రోగికి ఐదారు లక్షలు బిల్లవుతుంది. ఇందులో 30 శాతం అంటే రూ.1.50 లక్షలు ఇక్కడి డాక్టర్‌కు అందుతుండడం గమనార్హం. ఇలా నెలకు వేల మంది పేషెంట్లు హైదరాబాద్, బెంగళూరు వెళుతున్నారు. తమ ఆస్పత్రిలోనే పిండుకున్నంత పిండుకోవడం.. చివరికి రోగి పరిస్థితి సీరియస్ అంటూ చేతులెత్తేసి హైదరాబాద్‌కు పంపించడం.. ఇదీ జిల్లాకు చెందిన కొందరు వైద్యుల తంతు. ఇలాంటి విష సంస్కృతి ఇటీవలి కాలంలో తీవ్రంగా పెరిగింది.

ఆస్తులు అమ్ముకోవాల్సిందే..

ఇటీవల జిల్లాలో ఏ ఆస్పత్రికెళ్లాలన్నా రోగులు భయపడుతున్నారు. రోగమేదో చెప్పరు.. ఎంతవుతుందో అసలే వెల్లడించకపోవడంతో భయకంపితులవుతున్నారు. టెస్టులతోనే వారం రోజులు గడిపి ఆ తర్వాత తమ చేత కాదంటూ చేతులెత్తేస్తూ హైదరాబాద్, బెంగుళూరులో ఫలానా డాక్టర్ల దగ్గరకు వెళ్లండని చెబుతున్నారు. అక్కడికెళ్లాక రోగి ఆస్తులమ్ముకునే వరకూ వదలడం లేదు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు ఇలా

కేటగిరీ	సంఖ్య
వ్యక్తిగత క్లినిక్‌లు	65
పాలీ క్లినిక్‌లు (గ్రూప్ ప్రాక్టీషనర్లు)	06
20 పడకల లోపు నర్సింగ్‌హోంలు	121
50 పడకల లోపు నర్సింగ్‌హోంలు	32
100 పడకల లోపు ఆస్పత్రులు	15
200 పడకల లోపు ఆస్పత్రులు	04
200 పడకల పైన ఆస్పత్రులు	02

పండుగ పూట విషాదం




మల్లికార్జున మృతదేహం, గౌరీ శంకర్ (ఫైల్)

శెట్టూరు: వినాయక చవితి పండుగ పూట విషాదం నెలకొంది. శెట్టూరు గ్రామంలో రెండు రోజుల్లో రెండు ఆత్మహత్య ఘటనలు గ్రామస్తులను షాక్‌కు గురి చేశాయి. వివరాలు.. బుధవారం వినాక చవితి రోజున శెట్టూరుకు చెందిన బోయ మల్లికార్జున (50) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చాలా రోజుల నుంచి కడుపు నొప్పితో మల్లికార్జున బాధపడుతున్నాడు. ఇటీవల అపెండిక్స్ ఆపరేషన్ చేయించుకున్నా నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపం చెంది బుధవారం తమ పొలంలోకి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. పొలానికి వెళ్లిన తండ్రి ఓబుళప్ప మల్లికార్జున చెట్టుకు వేలాడుతుండడం చూసి వెంటనే ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు విషయం తెలిపాడు. మృతుని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిసింది.

మద్యానికి డబ్బివ్వలేదని మరో వ్యక్తి..

గురువారం శెట్టూరులో ముత్రాసి శంకర్ (38) తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీకి టవల్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల తాగుడుకు బానిసైన శంకర్ మద్యం తాగడానికి డబ్బు ఇవ్వాలని భార్యను అడిగాడు. 'ఇప్పటికే తాగేసి ఉన్నావు.. ఇక వద్దు' అని భార్య దండించింది. దీంతో మనస్తాపం చెందిన శంకర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. దీనిపై మృతుని భార్య లలితమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శంకర్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. మల్లికార్జున, శంకర్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వరుసగా గ్రామంలో ఆత్మహత్యలు చోటుచేసుకోవడంతో శెట్టూరు గ్రామస్తులు షాక్‌కు గురయ్యారు.

డీఎస్సీ కాల్‌లెటర్ల వెనుక కథలెన్నో..

- డీఎస్సీ–25కి ఎంపికైన అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన
- 807 పోస్టులకు గాను తొలిరోజు 625 మంది అభ్యర్థులకు మెసేజ్‌లు
- తక్కువ ర్యాంకులు వచ్చిన వారిని పిలిచారంటూ మెరిట్ అభ్యర్థుల ఆవేదన
- తొలిరోజు పకడ్బందీగా సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–25లో మెరిట్ సాధించిన చాలామంది అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలనకు మెసేజ్‌లు (కాల్ లెటర్లు) రాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 807 వివిధ కేటగిరీ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. మెరిట్ సాధించి ఎంపికైన అభ్యర్థులకు గురువారం అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఎవరికైతే మెసేజ్ అందుతుందో వారు మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలంటూ చెప్పారు. అయితే చాలామంది మెరిట్ జాబితాలో మంచి ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు కూడా మెసేజ్‌లు రాకపోవడంతో గందరగోళానికి గురయ్యారు. మెసేజ్‌లు రాకపోయినా అక్కడికి చేరుకున్నారు. జిల్లా పరిశీలకులు, పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును కలిసి విన్నవించారు. రాష్ట్ర కార్యాలయం నుంచి తొలిరోజు 625 మంది అభ్యర్థులకు సంబంధించిన సమాచారం మాత్రమే వచ్చిందని, తక్కిన వారికి శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని వారు స్పష్టం చేశారు. కాగా, సర్టిఫికెట్ల పరిశీలనకు డీఈఓ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ రాత్రి 10.30 గంటలకు ముగిసింది. తొలిరోజు ఐదుగురు గైర్హాజరయ్యారు. వారికి సర్టిఫికెట్ల పరిశీలనకు శుక్రవారం కూడా అవకాశం ఇస్తున్నట్లు డీఈఓ తెలిపారు. శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. రాత్రి 10 గంటల సమయానికి 132 మంది జాబితా జిల్లా విద్యాశాఖ అధికారులకు చేరింది. వారందరూ ఉదయం 9 గంటలకు హాజరుకానున్నారు.

తక్కువ ర్యాంకులు వచ్చిన వారికి..

తమకంటే తక్కువ ర్యాంకులు వచ్చిన వారికి కాల్ లెటర్లు వచ్చాయని, తమకు రాలేదంటూ కొందరు అభ్యర్థులు వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే తమకు సంబంధం లేదంటూ చేతులెత్తేశారు. ఒకే సబ్జెక్టు ఒకే కేటగిరీలో తక్కువ ర్యాంకులు వచ్చిన వారికి కాల్‌లెటర్లు వచ్చినా ఎక్కువ ర్యాంకులు సాధించిన వారికి కాల్‌లెటర్లు రాలేదు. అధికారులను అడిగితే తమకు సంబంధం లేదంటున్నారని, వెబ్‌సైట్‌లో ఉంచిన హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్లు చేసినా కనీస స్పందన లేదంటూ ఆయా అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిశీలకులు, స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావును కలిసి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.



ప్రక్రియను పరిశీలిస్తున్న పరిశీలకులు సుబ్బారావు

బఫర్ స్టాక్.. బయటకు తీస్తే ఒట్టు

వ్యవసాయ శాఖ తీరుపై సర్వత్రా విమర్శలు
- మార్క్‌ఫెడ్ వద్ద మూలుగుతున్న 700 మెట్రిక్ టన్నుల యూరియా
- రైతులు ఇబ్బంది పడుతున్నా బయటకు తీయని అధికారులు
- కోటా మేరకు 2 వేల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉన్నా సరఫరా అనుమానమే

అనంతపురం అగ్రికల్చర్: యూరియా కోసం రైతులు రోజుల తరబడి ఎదురుచూస్తున్నా అందుబాటులోకి తేవడం లేదు. వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఎదుగుదలలో ఉన్న మొక్కజొన్నకు చాలా అవసరం ఉంది. అరటి రైతులదీ అదే పరిస్థితి. వేరుశనగ, ఆముదం, పత్తి లాంటి పంటలకు పైపాటుగా వేసుకునేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు. కానీ కూటమి సర్కారు మాత్రం జిల్లాకు యూరియా సరఫరా చేయించడం లేదు. పరిస్థితి తీవ్రంగా ఉన్నా 10 రోజులుగా ఒక్క యూరియా బస్తా కూడా రావడం లేదు. పెద్దగా అవసరం లేని కాంప్లెక్స్ ఎరువులు పంపుతున్నారు. కోటా మేరకు ఈ నెలాఖరులోపు 2 వేల మెట్రిక్ టన్నులు రావాల్సిన యూరియా ఎటు వెళ్లిందో వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు చెప్పడం లేదు.

మార్క్‌ఫెడ్ దగ్గర ఉన్నా...

'మార్క్‌ఫెడ్ దగ్గర బఫర్‌స్టాక్ కింద 700 మెట్రిక్ టన్నుల యూరియా మూలుగుతోంది. బయటకు మాత్రం తీయడం లేదు. రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్, సొసైటీల్లో ఒక్క బస్తా కూడా అందుబాటులో లేదు. వారం క్రితం బఫర్‌స్టాక్ కింద 1,016 మెట్రిక్ టన్నులు ఉండగా... అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కొందరు ఒత్తిడి చేసి తమకు అవసరమైన ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలకు 316 మెట్రిక్ టన్నులు తీసుకెళ్లారు. రాప్తాడు, బొమ్మనహాళ్, ఉరవకొండ ప్రాంతాలకు కొంత వరకు తరలించారు. మిగతా 700 మెట్రిక్ టన్నులు మాత్రమే అలాగే ఉంది. అంటే దాదాపు 15,500 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నా రైతులకు ఇవ్వకపోవడం గమనార్హం. రైతుల నుంచి డిమాండ్ అధికంగా ఉన్నా బఫర్‌స్టాక్ ఎవరి కోసం పెట్టారో చెప్పడం లేదు. త్వరలో మూడు కంపెనీల నుంచి యూరియా వస్తుందంటున్నా 150 నుంచి 200 మెట్రిక్ టన్నులకు మించి ఉండకపోవచ్చని ఆ శాఖ వర్గాలే చెబుతున్నాయి. కనీసం 2 వేల మెట్రిక్ టన్నులు వస్తే కానీ యూరియా సమస్య తీరే అవకాశం లేదని తెలుస్తోంది.

27 వేల మెట్రిక్ టన్నులపై సందేహాలు..

వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ ద్వారా ఈ ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 27 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని చెబుతున్న లెక్కలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ హోల్ సేల్, రీటైల్ డీలర్లకు ఎంత ఇచ్చారు.. ఆర్‌ఎస్‌కేలు, డీసీఎంఎస్‌లు, సొసైటీలకు ఎంత ఇచ్చారు.. ఆ యూరియా ఎంత మంది రైతులకు పంపిణీ చేశారనే వివరాలు చెప్పడానికి అధికారులు వెనుకాడుతున్నారు. కచ్చితంగా పెద్ద మొత్తంలో యూరియా పక్కదారి పట్టిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖరీఫ్ పంటల సాగు సాధారణం కన్నా 35 శాతం తక్కువగానే ఉన్నా యూరియా కొరత ఏర్పడటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బాల్య వివాహాలను అరికట్టాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'జిల్లాలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకూడదు. అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. బాల్య వివాహాల నివారణపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఐగాట్' యాప్‌ను ఉపయోగించి అందులో బాల్య వివాహాలకు సంబంధించి శిక్షణలు ఏవైనా ఉంటే వాటిని షేర్ చేసుకోవాలని సూచించారు. బాలికలకు ఎలాంటి పథకాలు ఉన్నాయనే విషయంపై డీఆర్‌డీఏ, మెప్మా, లీడ్ బ్యాంక్ అధికారులు ఏడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో వాల్ పెయింటింగ్స్ వేసే ప్రక్రియ రెండు వారాల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని జెడ్పీ సీఈఓని ఆదేశించారు. జిల్లాలో ఎన్ని బాల్య వివాహాలు జరిగాయి, ఎన్ని ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి, బైండోవర్ ఎన్ని జరిగాయనే వివరాలతో నివేదిక ఇవ్వాలన్నారు. వివాహాలు రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు ఆన్‌లైన్‌లో నమోదైన వాటి నివేదికతో హాజరవ్వాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. సమావేశంలో స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ నాగమణి, మిషన్ వాత్సల్య కో–ఆర్డినేటర్ శ్రీదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జెడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఈఓ వెంకటరమణ నాయక్, మెప్మా పీడీ విశ్వజ్యోతి, డీపీఓ నాగరాజు నాయుడు, డీఎస్పీ మహబూబ్‌బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

జిల్లాలో సెప్టెంబరు ఒకటో తేదీన ఎన్‌టీఆర్ భరోసా పథకం కింద చేపట్టనున్న పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టర్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న పింఛను సొమ్మును బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకోవాలని చెప్పారు. పెన్షన్ పంపిణీ ప్రక్రియను దుర్వినియోగం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన సచివాలయ ఉద్యోగుల వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. చౌక దుకాణాల్లో రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.



అనంతపురం సప్తగిరి సర్కిల్‌లో కొలువుదీరిన గణపయ్య





అనంతపురంలోని పలు ప్రాంతాల్లో వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్న విఘ్న నాయకుడు

లంబోదరా.. మముబ్రోవరా

జిల్లాలో విఘ్న నాయకుడి నామస్మరణ మార్మోగుతోంది. జిల్లావ్యాప్తంగా వాడవాడలా గణపయ్యలు కొలువుదీరారు. బుధవారం ఉదయం మండపాల్లో వినాయకున్ని కొలువుదీర్చి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లంబోదరుడి దర్శనానికి పోటెత్తిన భక్తులతో సందడి నెలకొంది. అనంతపురం కృష్ణకళా మందిర్‌లోని రెవెన్యూ భవనంలో ఏర్పాటు చేసిన ''హరిత గణపతి''ని కలెక్టర్ వినోద్‌కుమార్ దంపతులు దర్శించుకుని తొలిపూజ నిర్వహించారు. గణనాథుని ఆశీస్సులతో జిల్లా ప్రగతిపథంలో సాగాలని ఆకాంక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సప్తగిరి సర్కిల్‌లో గణనాథుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



రెవెన్యూ భవన్‌లో గణేశుడిని దర్శించుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు 'అనంత' ఆతిథ్యం



జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన వారిని సత్కరించిన దృశ్యం

అనంతపురం కల్చరల్: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ యోగా పోటీలు ఈ ఏడాది నవంబర్‌లో జిల్లాలో నిర్వహించనున్నట్లు వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి తెలిపారు. ఇటీవల తాడేపల్లిలో జరిగిన యోగా పోటీల్లో జిల్లాకు చెందిన యోగాభ్యాసకులు మూడు స్వర్ణాలు, ఆరు రజతాలు, మూడు కాంస్య పతకాలు సాధించి, సెప్టెంబర్ 11న భిలాయ్‌లో, అదే నెలలో 27న విజయవాడలో జరిగే జాతీయ స్థాయిలో యోగా పోటీలకు అర్హత సాధించారు. ప్రతిభ చాటిన యోగాభ్యాసకులను గురువారం అనంతపురంలోని షిరిడినగర్ వివేకానంద యోగ భవన్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో యోగా గురువులు దివాకర్, పుల్లయ్య, మారుతీ ప్రసాద్, తారక్, నాని నవోమిన్ పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై నేడు శిక్షణ

అనంతపురం సిటీ: అనంతపురం జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో 'పంచాయతీ రాజ్ పురోగతి సూచిక 1.0' అనే అంశంపై ఒక రోజు శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించనున్నట్లు శిక్షణ కేంద్రం జిల్లా మేనేజర్ నిర్మల్ దాస్ గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, ఐసీడీఎస్ అధికారులు, డీడీఓలు, డీఎల్‌పీఓలు, ఇంకా పలు శాఖల అధికారులు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులు ప్రారంభిస్తారని వెల్లడించారు. సీఈఓ, డిప్యూటీ సీఈఓ కూడా పాల్గొంటారని వివరించారు.

స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు

రాప్తాడు రూరల్: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు..అనంతపురం రూరల్ మండలం నందమూరినగర్‌కు చెందిన గోవిందప్ప కుమారుడు కృష్ణ బీటెక్ పూర్తి చేశాడు. బుధవారం అర్ధరాత్రి సమయంలో నందమూరినగర్ నుంచి పిల్లిగుండ్లకాలనీకి బైకుపై వెళుతుండగా నరిగిమ్మ ఆలయం దాటిన తర్వాత ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో కృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని స్విమ్స్‌కు వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డబుల్ ట్రబులర్ రమణే!

- అక్రమ రిజిస్ట్రేషన్లతో భూవివాదాలకు ఆజ్యం పోసిన సబ్ రిజిస్ట్రార్
- ఆస్రా ఆస్పత్రి డబుల్ రిజిస్ట్రేషన్ వివాదం సద్దుమణగకనే మరొకటి వెలుగులోకి
- అనంతపురంలోని తపోవనం పరిధిలో రూ.కోట్లు విలువైన భూమికి డబుల్ రిజిస్ట్రేషన్
- సబ్ రిజిస్ట్రార్ రమణరావు తీరుతో భూ యజమానుల్లో బెంబేలు

రిజిస్ట్రేషన్ శాఖలో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్లే భూ వివాదాలకు ఆజ్యం పోస్తున్నారు. ఒకే స్థిరాస్తికి రెండు, మూడు రిజిస్ట్రేషన్లు చేస్తూ వివాదాలు సృష్టిస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి రికార్డులు పరిశీలించకుండా ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ క్రమంలో డబుల్ రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయి. డబుల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు తమ అధికార, ధన బలంతో స్థలాలను కబ్జా చేసుకుంటూ పోతుండగా వాస్తవ హక్కుదారులు లబోదిబోమంటూ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.



అనంతపురం టౌన్: జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్‌లో ఉన్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రధాన కార్యాలయంలో జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న రమణరావు లీలలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఒకే స్థిరాస్తికి డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తూ భూ వివాదాలకు ఆజ్యం పోసిన తీరు కాకరేపుతోంది. అనంతపురంలోని సాయినగర్‌లో ఉన్న ఆస్రా ఆస్పత్రి భవనానికి డబుల్ రిజిస్ట్రేషన్ చేయడంతో ఆ భవనాన్ని తొలుత కొనుగోలు చేసిన వ్యక్తులు... రమణరావు అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే తపోవనంలో 5వ రోడ్డుకు చెందిన బుడబుక్కల సామాజిక వర్గానికి చెందిన భూములను సైతం అమరనాథ్ చౌదరి, పురుషోత్తమనాయుడుకు డబుల్ రిజిస్ట్రేషన్ చేసి కట్టబెట్టిన వైనమూ వెలుగు చూసింది. దీంతో బాధితులు వామపక్ష పార్టీ నాయకులను ఆశ్రయించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన ఘటన మరువక ముందే ఎ.నారాయణపురంలో చోటు చేసుకున్న మరో ఘటన వెలుగులోకి వచ్చింది.

రూ.కోట్లు విలువ చేసే భూమికి డబుల్ రిజిస్ట్రేషన్

ఎ.నారాణపురం గ్రామ పొలంలో రూ.కోట్లు విలువ చేసే భూమికి సైతం డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. సర్వే నంబర్ 156–2లో 9.59 ఎకరాల భూమిని యజమాని ఈ.పెద్ద నారప్ప దశల వారీగా 1999లో 3 ఎకరాలు, 2002లో 2.40 ఎకరాలు, 2008లో 5ఎకరాల భూమిని విక్రయించాడు. దీంతో చివరకు పెద్ద నారప్పకు ఒక్క సెంట్ భూమి కూడా మిగల్లేదు. అయితే తాజాగా వారసులమంటూ కొంత మంది వ్యక్తులు వంశ వృక్షాన్ని సృష్టించుకొని తెర పైకి వచ్చారు. సర్వే నంబర్ 156–2లో వారసత్వంగా వారికి ఎలాంటి ఆస్తి సంక్రమించక పోయినా సబ్ రిజిస్ట్రార్ రమణరావును ప్రసన్నం చేసుకుని 1.19సెంట్ల స్థలాన్ని కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన ముకుందనాయుడు, అతని భార్య పద్మాగీత పేరిట ఈ నెల 6న రిజిస్ట్రేషన్ చేశారు. లేని భూమిని ఉన్నట్లుగా దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులు తాజాగా ఆ భూమిలో ఈ స్థలం మాదేనంటూ బోర్డులు సైతం నాటారు. దీంతో గతంలో భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు.

రికార్డు పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్

వ్యవసాయ భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ చేసే సమయంలో 1బీ, అడంగల్ తదితర రికార్డులతో పాటు ఈసీలను తొలుత పరిశీలించాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా రూ.కోట్లు విలువ చేసే భూమిని ఎలాంటి వారసత్వ రికార్డు లేని వ్యక్తులతో కుమ్మక్కై భారీగా దండుకొని డబుల్ రిజిస్ట్రేషన్ చేయడం వివాదానికి తెరతీసింది. చదరపు గజాల కింద చలానాలు కట్టించి అత్యంత విలువైన 1.19 ఎకరాల భూమిని మరో వ్యక్తికి కట్టబెట్టడం వెనుక పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. ఈ ప్రక్రియలో సబ్ రిజిస్ట్రార్ రమణరావుకు భారీగానే డబ్బు ముట్టినట్లు తెలుస్తోంది. అనంతపురంలోని అత్యంత విలువైన భూములకు డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తూ భూ వివాదాలకు ఆజ్యం పోస్తున్నట్లుగా ఆయనపై ఆరోపణలున్నాయి.



నారాయణపురంలో బోర్డు నాటిన దృశ్యం

ఉన్నతాధికారులకు ఫిర్యాదు



ఇప్పటికే అనంతపురం నగరంలో జరిగిన అనేక డబుల్ రిజిస్ట్రేషన్లపై బాధిత భూ యజమానులు అర్జీలు ఇచ్చారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తాం. డబుల్ రిజిస్ట్రేషన్ల రద్దుకు సిఫారసు చేస్తాం. ఇదే విషయంపై కలెక్టర్‌కు సైతం నివేదికను అందజేస్తాం. డబుల్ రిజిస్ట్రేషన్లను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించం. సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, డీఐజీ, రిజిస్ట్రేషన్ శాఖ

విద్యుత్ చార్జీలపై మరో ఉద్యమం



ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

అనంతపురం అర్బన్: బషీర్‌బాగ్ అమరుల స్ఫూర్తితో విద్యుత్ చార్జీలపై మరో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు స్పష్టం చేశారు. బషీర్‌బాగ్ ఉద్యమానికి గురువారంతో పాతికేళ్లు పూర్తయిన నేపథ్యంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలోని క్లాక్ టవర్ వద్ద 'ప్రతిజ్ఞ దినం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకగా పోరాటాలకు సిద్ధం కావాలంటూ ఈ సందర్భంగా నాయకులు పిలుపునిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేంద్రకుమార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాగరాజు, సీపీఐ ఎంఎల్ చంద్రశేఖర్, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర మాట్లాడారు. 2000లో ప్రపంచ బ్యాంక్ షరతులకు తలొగ్గి నాటి సీఎం చంద్రబాబు భారీగా విద్యుత్ చార్జీలు పెంచారని గుర్తు చేశారు. ఈ ప్రజా వ్యతిరేక చర్యను నిరసిస్తూ చలో అసెంబ్లీ నినాదంతో వామపక్ష పార్టీలు చేపట్టిన ప్రదర్శనపై బషీర్‌బాగ్ వద్ద పోలీసులు కాల్పులకు తెగబడడంతో నాయకులు బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి అసువులు బాసారన్నారు. ప్రస్తుతం అదే సీఎం చంద్రబాబు మరోసారి రూ.15,485 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. అంతటితో ఆగకుండా మరో 12,717 కోట్ల భారం మోపేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల రద్దు, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిలిపివేత, విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగిస్తున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

కుప్పంపై ఉన్న ప్రేమ.. 'దుర్గం'పై లేదా?

- నెలల వ్యవధిలోనే కుప్పం ప్రాంతానికి నీటిని తరలించామంటున్నారు
- 16 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చలేకపోయారు
- 'దుర్గం' ఎమ్మెల్యే అమిలినేనిపై వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త రంగయ్య ధ్వజం

కుందుర్పి: రేయింబవళ్లు పని చేసి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకెళ్లినట్లు ప్రకటనలు ఇస్తున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, ఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత అమిలేని సురేంద్రబాబు.. తన సొంత నియోజకవర్గంలోని చెరువులను ఎందుకు నింపలేకపోయారని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య నిలదీశారు. కుందుర్పి మండలం మహంతపురం, కదరంపల్లి గ్రామాల మధ్య బీటీపీ కాలువను మండల నాయకులు, రైతులతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. అంతకు ముందు గంటపాటు కాలువలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడారు. కుప్పం ప్రాంతానికి కృష్ణా జలాలను తరలించేందుకు అక్కడి ఎమ్మెల్యే చంద్రబాబు 150 భారీ యంత్రాలను ఏర్పాటు చేశారని, కేవలం నెలల వ్యవధిలోనే అనంతపురం జిల్లా మీదుగా కృష్ణా జలాలను కుప్పం ప్రాంతానికి తరలించారని గుర్తు చేశారు. అయితే ఈ పనులు పూర్తి చేసింది ఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ అధినేతయైన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబేనన్నారు. నియోజకవర్గ ప్రజల తాగునీటి, సాగునీటి అవసరాలు తీర్చేందుకు చేపట్టిన బీటీపీ ప్రాజెక్ట్ పనులను ఏడేళ్ల గడిచినా సదరు కాంట్రాక్టర్, ఎమ్మెల్యే అమిలినేని నేటికీ పూర్తి చేయలేకపోయారన్నారు. కుప్పం మీద ఉన్న అభిమానం కళ్యాణదుర్గం మీద ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. జిల్లా రైతులకు అన్యాయం చేస్తూ హంద్రీనీవాకు లైనింగ్ పనుల ద్వారా కుప్పంలోని 110 చెరువులను నీటితో నింపే పనులను మాత్రం ఆగమేఘాలపై పూర్తి చేశారని ధ్వజమెత్తారు.



బీటీపీ కాలువలో మహంతపురం వద్ద పాదయాత్ర చేస్తున్న రంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు

జగనన్న ప్రభుత్వంలోనే పరిహారం

బీటీపీ కాలువ నిర్వాసిత రైతులకు జగనన్న ప్రభుత్వంలోనే పరిహారం అందిందని తలారి రంగయ్య గుర్తు చేశారు. కానీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు పైసా పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. పరిహారం కింద బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన రూ.110 కోట్లు ఏమయ్యాయో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలా నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.హనుమంతరాయుడు, గొర్ల సూరి, జి.హనుమంతరాయుడు, చంద్రశేఖర్, పాలాక్షి, మందలపల్లి భీమప్ప, సర్పంచులు రామ్మూర్తి, గంగాధర, విజయ్, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, ఎంపీటీసీ ఈరన్న, బీటీ రాము, బెస్తరపల్లి బాబు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అన్నదాత దుఃఖీభవ!



- సుఖీభవ పథకం లబ్ధి కోసం అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- సొమ్ము కోసం ఇంకా 20 వేల మంది రైతులు వెయిటింగ్
- గతంలో క్రమం తప్పకుండా 'భరోసా' అందించిన వైఎస్ జగన్



సుఖీభవ, పీఎం కిసాన్ కోసం సోమవారం జేడీఏ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

అనంతపురం అగ్రికల్చర్: అన్నదాత సుఖీభవ పథకం కాస్త రైతుల పాలిట దుఃఖీభవగా మారింది. కేంద్ర ప్రభుత్వం అందజేసే పీఎం కిసాన్ పరిస్థితి కూడా అలాగే ఉంది. రైతులను మభ్యపెట్టి మొదటి ఏడాది సుఖీభవ కింద చెల్లించాల్సిన రూ.400 కోట్లకు పైగా పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు ఈ ఏడాది పథకాన్ని అమలు చేసింది. అందులో అర్హులైన కొందరు రైతులకు కొర్రీలు వేసింది. ఈ నెల 2న 2.75 లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ కింద రూ.2 వేలు ప్రకారం రూ.53.3 కోట్లు, సుఖీభవ కింద రూ.5 వేల ప్రకారం రూ.137.82 కోట్లు చొప్పున మొత్తం రూ.191.45 కోట్లు విడుదల చేశారు. అయితే జాబితాలు అస్తవ్యస్తంగా ఉండటం, ఎన్‌పీసీఐ, ఈకేవైసీ లేదంటూ విడుదల చేసి 25 రోజులవుతున్నా నేటికీ వేలాది మంది రైతులకు సొమ్ము జమ కాలేదు. దీంతో రైతులు ఆర్‌ఎస్‌కేలు, వ్యవసాయశాఖ ఏఓ, ఏడీఏ, జేడీఏ కార్యాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసుల చుట్టూ తిరుగుతున్నారు.

సాంకేతిక కారణాలు చూపుతూ..

ఎన్‌పీసీఐ ఇన్‌యాక్టివ్ అంటూ 5,800, ఎన్‌పీసీఐ నాట్ మ్యాపింగ్ అంటూ 1,500 మందితో పాటు వివిధ కారణాలతో మరో 13 వేల మందికి ... మొత్తంగా 20 వేల మంది సుఖీభవ సొమ్ము అందక నానాపాట్లు పడుతున్నారు. గ్రామాలు, మండలాల్లో స్పష్టత లేక జేడీఏ కార్యాలయానికి ప్రతి రోజూ పదుల సంఖ్యలో రైతులు వచ్చి ఆరాతీస్తున్నారు. ప్రధానంగా సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన అకౌంట్లకు రెండో విడతగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకపోవడంతో సొమ్ము జమ కావడం లేదని చెబుతున్నారు. కొందరికి సుఖీభవ సొమ్ము, మరికొందరికి పీఎం కిసాన్ సొమ్ము జమ కావడం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి. ఈకేవైసీ, ఎన్‌పీసీఐ చేయించామని రైతులు చెబుతున్నా.. ప్రాసెస్‌లో ఉంది, జమ అవుతుందని అధికారులు నచ్చజెబుతున్నారు. అక్టోబర్‌లో రెండో విడత కింద పీఎం కిసాన్ రూ.2 వేలు, సుఖీభవ కింద రూ.5 వేలు జమ కానుంది.

వైఎస్ జగన్ హయాంలో ఠంచన్‌గా 'భరోసా'

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న 2019–24 మధ్య కాలంలో ఏటా జూన్, అక్టోబర్, జనవరిలో రైతు భరోసా, పీఎం కిసాన్ సొమ్ము రైతులకు జమ చేస్తూ వచ్చారు. అప్పట్లో ఏటా ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున 2.92 లక్షల మందికి భరోసా అందించారు. వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో జిల్లా రైతులకు రూ.1,937 కోట్ల మేర పెట్టుబడి సాయం అందింది. అప్పటి జాబితాతో పోల్చుకుంటే రైతుల సంఖ్య కొంత పెరగాల్సి ఉండగా, దాదాపు 20 వేల మంది రైతులకు కొర్రీలు వేయడం విశేషం. గత జాబితాల ఆధారంగా జమ చేసినా ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదంటున్నారు. ఇలా మొదటి ఏడాది రూ.400 కోట్లు ఎగనామం పెట్టడంతో పాటు కొర్రీలు వేసి 20 వేల మందికి అన్యాయం చేయడం, సాంకేతిక కారణాలు చెప్పి మరికొందరిని ఇబ్బందులకు గురి చేస్తుండటంపై రైతులు మండిపడుతున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు రమణ

గుమ్మఘట్ట: రాయదుర్గం మండలం డి కొండాపురం గ్రామానికి చెందిన రమణ (52) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. గురువారం గ్రామ శివారున కొందరు పేకాట ఆడుతుండగా రమణ కూడా అక్కడే ఉన్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఇద్దరు పోలీసులు.. జూదరులను గుర్తించి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పక్షవాతంతో బాధపడుతున్న రమణను కొట్టి పేకాట ఆడేవారంతా పోలీస్‌స్టేషన్ రావాలని చెప్పి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత రమణ స్పృహ తప్పిపడిపోవడంతో చికిత్స కోసం హుటాహుటినా రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని అర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు. కాగా, రమణ మృతిపై స్థానికులు, కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర విచారణ చేపట్టి నిజాలను బహిర్గతం చేయాలని పోలీసులను కోరారు.

పురాతన విగ్రహాలను ధ్వంసం చేసిన టీడీపీ నేత

కుందుర్పి: మండల కేంద్రానికి చెందిన టీడీపీ నేత దొమ్మర మారెప్ప తన ఇంటి నిర్మాణం కోసం పురాతన విగ్రహాలున్న బండరాళ్లను గురువారం ధ్వంసం చేశాడు. ట్రాక్టర్లను ఏర్పాటు చేసి బండరాళ్లను ధ్వంసం చేస్తుండగా చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. ధ్వంసమైన గుండ్లపై అత్యంత ప్రాచీన దేవతామూర్తుల విగ్రహాలు చెక్కిన విషయాన్ని గుర్తించారు. కాగా, గతంలో పలుమార్లు పురావస్తు శాఖ అధికారులు సైతం వీటిని పరిశీలించారు. వీటిపై ప్రత్యేకంగా అధ్యయనం కొనసాగుతోంది. తహసీల్దార్ ఓబులేసు హెచ్చరికలతో టీడీపీ నేత పనులు నిలిపి వేశారు.

'దుర్గం'లో రెండు వర్గాల మధ్య ఘర్షణ

కళ్యాణదుర్గం: నియోజకవర్గ కేంద్రంలో రెండు మతాల మధ్య వివాదం తలెత్తింది. పోలీసులు తెలిపిన మేరకు... పట్టణంలో రెండు రోజులుగా మసీదుల్లో ముస్లింలు మిలాద్–ఉన్–నబీ ప్రార్థనలు జరుపుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 9.30 నుంచి 10 గంటల వరకు మారెంపల్లి కాలనీలో ఉన్న మసీదులో ప్రార్థనలు జరిగాయి. ఆ సమయంలో మైకు శబ్దాన్ని తగ్గించాలని స్థానిక యువకులు సూచించడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ యువరాజు సంఘటన స్థలానికి వెళ్లి సర్దిచెప్పారు. అనంతరం ఇరు మతాల పెద్దలను పోలీసుస్టేషన్‌కు పిలిపించి చర్చలు జరిపారు. శాంతి సామరస్యంగా సోదరభావంతో మెలగాలని సూచించారు.

చిరుత దాడిలో మేక మృతి

కళ్యాణదుర్గం: స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని దొడగట్ట గ్రామ శివారున ఓ రైతుకు చెందిన మేకను ఓ చిరుత లాక్కెళ్లి తినేసింది. మేకలను మేపు కోసం సమీపంలోని గుట్టల్లోకి తీసుకెళ్లినప్పుడు తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానిక రైతులు వాపోయారు. బుధవారం ఓ మేక పోతును లాక్కెళ్లి చంపి తింటుండడం గమనించిన రైతులు కేకలు వేయడంతో చిరుత పారిపోయింది. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతలను బంధించాలని పలువురు కోరుతున్నారు.

నేత్రపర్వంగా సిడిమాను ఉత్సవం



మారెమ్మ ఆలయం వద్ద సిడిమానుకు యువకుడిని కట్టి తిప్పుతున్న దృశ్యం



ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం టౌన్: స్థానిక కోటలో వెలసిన మారెమ్మ ఆలయం, నేసేపేటలోని దండు మారెమ్మ, కొల్లాపురమ్మ ఆలయాల వద్ద బుధవారం సాయంత్రం సిడిమాను ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దుగ్గిలమ్మ జాతర మరుసటి రోజు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కోటమారెమ్మ ఆలయం వద్ద జరిగిన సిడిమాను ఉత్సవానికి రాయదుర్గం నియోజకవర్గంతో పాటు సరిహద్దు కర్ణాటకలోని గ్రామాల్లోని నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరై, ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరాళ్ల శివకుమార్, వార్డు ఇన్‌చార్జ్ పైతోట రఘు, రామాంజనేయులు, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు మురడి మురళీమోహన్‌రెడ్డి, నాయకులు బోర్‌వెల్ ఆనందరెడ్డి, పట్టణ ప్రచార కార్యదర్శి తిప్పేస్వామి, న్యాయవాది వెంకటరెడ్డి, బంగి రమేష్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వైద్య సిబ్బందిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

రాప్తాడు: కదిరి ఆస్పత్రిలో డ్యూటీలో ఉన్న డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బందిపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి శివకృష్ణ, ఏపీ ఎన్జీఓ నగర కార్యదర్శి, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నగర కార్యదర్శి పి.శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాప్తాడులోని పీహెచ్‌సీ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలని.. దాడి, దౌర్జన్యం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరసింహ, ఫార్మాసిస్ట్ మూర్తి, స్టాఫ్‌నర్స్ లక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్ అరుణ, ఎఫ్ఎన్ఓ దేవయాని, రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు నో.. ఇప్పుడు ఎస్!

- టీపీఎస్‌గా మంజులమ్మ నియామకంపై సర్వత్రా విమర్శలు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో 'పచ్చ' పార్టీ నేతలు అనుకుంటే చాలు ఏ అధికారినైనా ఇట్టే పంపించేస్తారు..అన్నీ సర్దుకుంటే తిరిగి తీసుకువస్తారు. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో అదే పరిస్థితి నెలకొంది. రెండు నెలల క్రితం టీపీఎస్ మంజులమ్మ వద్దని, భవనాల అతిక్రమణలు, నిర్మాణదారుల వద్దకు నేరుగా వెళ్తూ సమస్యలు తీసుకు వస్తున్నారని ఆమెను సరెండర్ చేయాలని 'తెలుగు తమ్ముళ్లు' ప్రతిపాదించారు. నగరపాలక సంస్థ అధికారులు సైతం జీ హుజూర్ అనడంతో మంజుమ్మ ఈ ఏడాది జూన్, జూలైలో అదృశ్యమయ్యారు. అలా వెళ్లిన ఆమె.. తిరిగి ఈ నెలలో విధుల్లోకి చేరడం చర్చనీయాంశమైంది. తెలుగు తమ్ముళ్ల ఆశీస్సులు లభించడంతోనే ఆమె విధుల్లోకి వచ్చినట్లు తెలిసింది. ఇలాగైతే నగరంలో జరిగే అనధికార నిర్మాణాలు, ఇతర వాటిపై ఎలాంటి చర్యలుంటాయో చెప్పాల్సిన పనిలేదు.

అంగన్‌వాడీలో ఆటపాటల విద్య

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని అనంతపురం రూరల్ సీడీపీఓ ఉమా శంకరమ్మ పేర్కొన్నారు. గురువారం రాప్తాడు–1, 2 సెక్టార్లలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మరూరు అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలందరికీ మొబైల్‌ఫోన్లు వెనక్కు ఇచ్చామని, మిల్క్ అథెంటికేషన్ రిసిప్టులు వెంటనే యాప్‌లో చేయాలన్నారు. సరుకుల్లో నాణ్యత లోపిస్తే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హేమతల, నాగరత్న, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


రమేష్ బాబు (ఫైల్)

రాప్తాడు: మండలంలోని ఎం.బండమీదపల్లిలోని మోడల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఈడిగ అనిమెల రమేష్ బాబు (49) గుండెపోటుతో ఈ నెల 27న మృతి చెందారు. ఈయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రమేష్‌బాబు అంత్యక్రియలు స్వస్థలం శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండల కేంద్రంలో నిర్వహించారు. ఉపాధ్యాయుడి మృతికి హెచ్ఎం ప్రసాద్, తోటి ఉపాధ్యాయులు శ్రద్ధాంజలి ఘటించారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

అనంతపురం: నగరంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైనట్లు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోగుల తోయజాక్షి అనంతపురం నగరంలోని బస్టాండ్ దగ్గర గల శ్రీ చైతన్య ఇంటర్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. గురువారం రాత్రి 7 గంటలకు నోట్‌బుక్ కొనుక్కుని వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. మళ్లీ తిరిగి రాలేదు. దీంతో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తోయజాక్షి తల్లిదండ్రులు గోగుల వాణి, గోగుల నారాయణ స్వామి ఫిర్యాదు చేశారు.

వ్యక్తులపై దాడి

అనంతపురం: నగరంలో ఐదో రోడ్డు 9వ క్రాస్‌లోని యల్లమ్మ గుడి వద్ద వ్యక్తులపై కొందరు దాడికి పాల్పడ్డారు. అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు శేఖర్ ఫిర్యాదు చేసిన మేరకు వివరాలు... శేఖర్ పాత చీరల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన చెల్లెలు లావణ్యను 8 సంవత్సరాల క్రితం ఐదోరోడ్డుకు చెందిన దుర్గన్న కొడుకు శివరామ్‌కు ఇచ్చి పెళ్లి చేశాడు. పెళ్లయిన కొన్ని రోజులు లావణ్యను బాగా చూసుకున్నారు. అనంతరం అదనపు కట్నం కావాలని మానసికంగా, శారీకరంగా వేధించేవారు. దీంతో లావణ్య ఆగస్టు 9న మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం పంచాయితీకి రమ్మని చెప్పి యల్లమ్మ గుడి వద్ద పెద్ద మనుషులు రాజీకి ప్రయత్నించారు. అయితే, సూరి, పెద్దయ్య, జయశ్రీ ఉలిగమ్మ, దుర్గమ్మ రాజు కలిసి శేఖర్, అయన తమ్ముడు పవన్‌పై దాడి చేశారు. కర్రలతో కొట్టి గాయపరిచారు. కుళ్లాయమ్మ, కల్యాణ్, లాస్య, కల్లప్పలకు రాళ్ల దెబ్బలు తగిలాయి. అడ్డు వచ్చిన శేఖర్ సోదరి కుమారిని కిందపడేసి కొట్టారు. పెద్ద మనుషులు, చుట్టు పక్కల వారు విడిపించి అందరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ కే. శాంతిలాల్ తెలిపారు.


సప్తగిరిసర్కిల్‌లో కొలువుదీరిన వినాయకుడి పూజలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, ఉత్సవ కమిటీ ప్రతినిధులు


కమలానగర్‌లో శివలింగానికి జలాభిషేకం


కలెక్టరేట్ వద్ద ..


శ్రీనగర్ కాలనీలో..

ఏకదంతాయ.. బహురూపాయ

విఘ్ననాయకుని రాకతో అనంతపురం నగరంతో పాటు రాప్తాడు నియోజకవర్గం ఆధ్యాత్మిక సాగరంలో మునిగింది. 'వక్రతుండ మహాకాయ..కోటి సూర్య సమప్రభ' అంటూ విఘ్నాలను తొలగించే వినాయకుని నామస్మరణతో మార్మోగింది. వాడ వాడలా బహురూపాలలో ఏకదంతుడు కొలువుదీరాడు. జిల్లాలోనే అత్యంత వైభవంగా సాగే సప్తగిరి సర్కిల్ వినాయక చౌక్‌లో కారణగిరి వినాయకుడి వృత్తాంతంతో ఏర్పాటైన కదలికల వినాయకుడి ప్రతిమను చూసేందుకు భక్తులు తరలివచ్చారు. అలాగే నగరంలో పలు చోట్ల కొలువైన గణేశ ప్రతిమలను భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు.

– అనంతపురం కల్చరల్/ రాప్తాడు రూరల్/ఆత్మకూరు/రాప్తాడు:


రామ్‌నగర్ అలెగ్జాండర్ హోమ్స్‌లో


ఆత్మకూరులో ...


చిన్నయనగర్‌లో ..


కమలానగర్ సాగరకన్య వినాయకుడు


అశోక్‌నగర్‌లో నెమలి వినాయకుడు


పాతూరు పవర్ ఆఫీసు ఎదురుగా కృష్ణుడి రూపం


సున్నపుగేరిలో చిట్టిపొట్టి వినాయకుడు


ఫస్ట్ రోడ్డు రెండో క్రాస్‌లో..


శారదానగర్‌లో రుద్ర వినాయకుడు


అరవిందనగర్‌లో వెండి తామరపూల వినాయకుడు


బ్రాహ్మణ వీధిలో అష్టలక్ష్మి గణపతి


హౌసింగు బోర్డులో తాండవ వినాయకుడు


ఆదర్శకాలనీలో పూజలు అందుకున్న గణేశుడు


విద్యుత్‌నగర్‌లో .. ఆకట్టుకుంటున్న విఘ్నేశుడు


పాపంపేటలో తుంబాడ్ అమ్మవారి వేషధారణ


ఐదో రోడ్డులో కొలువైన వరసిద్ధి వినాయకుడు


బోయవీధిలో ..


పాతూరు గాలం వీధిలో ..


బోయ వీధిలో పార్వతీదేవి అలంకారం


కమలానగర్‌లో కొలువుదీరిన వినాయకుడు


కమలానగర్‌లో బొజ్జ గణపతి


మూడోరోడ్డులో దశావతార వినాయకుడు


గౌసుల్‌వారి వీధిలో కమలంలో బాల వినాయకుడు


కోవూరునగర్‌లో కాణిపాకం వినాయకుడు


నాల్గోరోడ్డులో..


పాతూరు వీధుల్లో పూరి జగన్నాథ్ మహారాజ్

మొక్కల రక్షణ.. నిధుల భక్షణ!

- నగరపాలక సంస్థలో మరో అడ్డగోలు బాగోతం
- టెండర్ లేకుండానే ట్రీ గార్డ్‌ల ఏర్పాటుకు చర్యలు
- 'తెలుగు తమ్ముడి'కి దోచిపెట్టేందుకు ఇంజినీర్ల అత్యుత్సాహం

అనంతపురం కార్పొరేషన్: నిన్న మొన్నటి వరకు నగరంలోని శ్రీనగర్ కాలనీలో టెండర్ లేకుండానే బీటీ రోడ్డును ఏర్పాటు చేసి అందుకు రూ.29 లక్షలు కొల్లగొట్టాలని ఓ డీఈ, సంబంధిత ఏఈలు చూశారు. ఇప్పుడు తాజాగా మరో అడ్డగోలు బాగోతం వెలుగు చూసింది. ఈ ఏడాది జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు ప్రజాప్రతినిధుల మెప్పు కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే ఓ 'తెలుగు తమ్ముడి'కి లబ్ధి చేకూర్చేందుకు అత్యుత్సాహంతో మొక్కల సంరక్షణకు సంబంధించి ట్రీ గార్డ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.


సెవెన్‌హిల్స్ కాలనీలో తూతూమంత్రంగా ట్రీ గార్డ్‌లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం (ఫైల్)

టెండర్ లేకుండానే..

వాస్తవంగా నగరపాలక సంస్థలో ఏదైనా పని విలువ రూ.లక్ష దాటితే టెండర్‌కు వెళ్లాలి. అయితే అలాంటిదేమీ లేకుండా అత్యవసరం పేరున ఇంజినీర్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. నగరంలోని ఆదర్శనగర్, విద్యుత్‌నగర్, హౌసింగ్ బోర్డు, అశోక్ నగర్, 1,2,3,4,5 రోడ్లు, బుడ్డప్పనగర్, సెవెన్ హిల్స్ కాలనీ, కలెక్టర్ బంగ్లా, రామచంద్రనగర్, రెవెన్యూ కాలనీ, వేణుగోపాల్ నగర్ తదితర ప్రాంతాల్లో 2 వేల మొక్కలు నాటుతున్నట్లు ప్రకటించారు. ఒక్కో మొక్కకు ఒక ట్రీ గార్డ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ట్రీ గార్డ్‌కు రూ.220 నుంచి రూ.250 లెక్కన మొత్తం 2 వేల ట్రీ గార్డ్‌లను ఎలాంటి టెండర్, కనీసం నామినేషన్ లేకుండా 'తమ్ముని'తో తెప్పించేలా చూశారు. ఈ లెక్కన రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు వెచ్చించినట్లు పేర్కొన్నారు. వాస్తవంగా ఈ పనులు చేపట్టాలంటే టెండర్‌కు వెళ్లాలి. టెండర్‌కు వెళితే పనులు నాణ్యతగా జరగడంతో పాటు నగరపాలక సంస్థకు డబ్బు ఆదా అయ్యేది. కానీ తెలుగు తమ్ముళ్లకు లబ్ధి చేకూర్చి ప్రజాప్రతినిధి వద్ద మార్కులు సంపాదించుకునేందుకు ఇంజినీర్లు తహతహలాడుతున్నారు. ఇదిలాఉంటే క్షేత్రస్థాయిలో పట్టుమని 500 ట్రీ గార్డ్‌లు కూడా లేవని నగరపాలక సంస్థ అధికారులే చెబుతుండడం గమనార్హం.

విజిలెన్స్ దృష్టి సారిస్తేనే..

నగరపాలక సంస్థలో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారిస్తే మరింత అవినీతి వెలుగు చూసే అవకాశం లేకపోలేదు. 2014–19 సమయంలో పాత డివైడర్లను తొలగించి, వాటి స్థానంలో పాత వాటినే ఏర్పాటు చేయడంతో పాటు ఒకే పనికి డబుల్ బిల్లులు తీసుకున్న బాగోతాలు విజిలెన్స్ తనిఖీలో వెలుగు చూశాయి. మరోసారి విజిలెన్స్ అధికారులు నగరపాలక సంస్థపై దృష్టి సారిస్తే బాగుంటుందని అధికార వర్గాలు అంటున్నాయి.

కమ్మనైన తెలుగు.. భవితకు వెలుగు

సందర్భం
నేడు తెలుగుభాషా దినోత్సవం

అనంతపురం కల్చరల్: 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్న రాయల ప్రశంసతో ఎందరో మహనీయులు తెలుగు భాషను సుసంపన్నం చేశారు. అంతర్జాతీయ వేదికలపై తెలుగువాడి గళాన్ని, భాషా మధురిమను ఘనంగా చాటారు. తెలుగుభాషను సామాన్యునికి సైతం అర్థమయ్యేలా చేయడానికి తెలుగు భాషా సేవకుడు గిడుగు రామమూర్తి వరంలా అవతరించాడు. వ్యవహార భాషా ఉద్యమాన్ని తీవ్రతరం చేసి, తెలుగు భాషకు శాశ్వతకీర్తినార్జించిపెట్టాడు. కనుకనే ఆయన స్మృత్యర్థం ఆయన జన్మదినమైన ఆగస్టు 29న తెలుగుభాష దినోత్సవంగా జరుపుకుంటూ గౌరవిస్తున్నాం. అనంత వేదికగా తెలుగు భాషా వికాస ఉద్యమం వారు భాషా ప్రచారానికి చిరస్మరణీయ కృషిని సాగిస్తున్నారు. శుక్రవారం తెలుగు భాషా పరిరక్షణ సమితి వారు డాక్టర్ నారాయణ నేతృత్వంలో ర్యాలీలు, తెలుగు తల్లికి నీరాజనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇంతింతై..

తెలుగు భాషకు పూర్వవైభవం కోసం 2001లో కర్నూలులో ఏర్పడిన తెలుగు భాషా వికాస ఉద్యమం అనంతలోనూ ప్రారంభమైంది. కవి, గాయకుడు డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి రథసారధిగా ఉంటూ ప్రతి నియోజకవర్గంలో తెలుగు తల్లి రథయాత్రలు, చైతన్య సదస్సులు, బాల వికాస వేదికలు నిర్వహించారు. 2010 తర్వాత క్రమం తప్పకుండా తెలుగు తల్లికి పల్లకీ సేవ, రథోత్సవం కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, అధికారులందరితో పండుగ వాతావరణంలో చేశారు. వేలాది మంది విద్యార్థులతో చేసిన తెలుగుతల్లి లక్షస్వరార్చన భాషా మార్మోగింది. ఒకప్పుడు కళ్యాణదుర్గం రోడ్డులో తెలుగుతల్లి విగ్రహం ఉండేది. రోడ్డు విస్తరణలో శిల్పారామానికి తరలించారు. దాంతో తెలుగు భాషా వికాస ఉద్యమ నేతలు ఒత్తిడి తెచ్చి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కంచుతో చేసిన తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటుకు, ప్రత్యేక కూడలిగా ఏర్పడడానికి కృషి చేశారు.


తెలుగు భాషా వికాస ఉద్యమ కార్యక్రమాలు (ఫైల్)

ప్రత్యేకంగా కృషి చేస్తున్నాం

ఏ ఇద్దరు తెలుగు వాళ్లు కలుసుకున్నా ఇంగ్లిషులో పలకరించుకోవడం పరిపాటిగా మారింది. మా వరకూ తెలుగు భాషా ప్రచారం కోసం పద్యం పట్ల అభిరుచి కలిగే విధంగా కృషి చేస్తున్నాం. పూర్వ వైభవం కోసం ప్రత్యేక కృషిని సాగిస్తున్నాం. ప్రాచీన సాహిత్యం అంతరించిపోకుండా తర్వాతి తరాల వారు గుర్తుంచుకునేలా అన్ని ప్రక్రియల్లో నైపుణ్యం పొందినపుడే తెలుగుకు నాటి సొగసులు వస్తాయి.

– డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి

అభిరుచి పెరగాలి

తమిళం, కన్నడిగులతో పోలిస్తే సాహిత్య పఠనం పట్ల తెలుగువారికి చాలా తక్కువ ఆసక్తి ఉంటుందనే చెప్పాలి. ఉత్తమ సాహిత్య పఠనంతోనే భాషాభిమానం పుట్టుకొస్తుంది. ముఖ్యంగా బాల సాహిత్యం ద్వారా భాషా ప్రచారం ఘనంగా సాధించవచ్చు. కన్నతల్లి లాంటి భాషను కాపాడుకోవడానికి గాయకుడిగా రెండు దశాబ్దాలుగా ప్రచారం చేస్తున్నా. కమ్మనైన తెలుగు భాష కలనైనా మరవద్దు అంటూ సాగే పాట అంతటా మార్మోగుతోంది.

– మహీధర్, తెలుగు భాషా ప్రచారకుడు

వైభవంగా బోడమల్లయ్య స్వామి ఉత్సవం


బోడమల్లయ్యస్వామి


బోడమల్లయ్యస్వామి పూజలకు హాజరైన భక్తులు

రాప్తాడు: మండలంలోని హంపాపురం – గొల్లపల్లి మధ్య పొలాల్లో వెలసిన బోడ మల్లయ్యస్వామి ఉత్సవం వైభవంగా జరిగింది. బాలగొండ కాపులు (కురుబలు) ఏటా వినాయక చవితి పండుగ మరుసటి రోజు ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా బుధవారం బాలగొండ కాపులు ఉపవాస దీక్షను ప్రారంభించారు. మరుసటి రోజు గురువారం బోడమల్లయ్యస్వామికి కుటుంబ సభ్యులు, తమ బంధువులతో కలసి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, నాగులు, గొరవయ్యలకు ఇంటి నుంచి తీసుకొచ్చిన పాలు పోసి ఉపవాసదీక్షను విరమించారు. గొరవయ్యలు రెండు గంటల పాటు నృత్యం చేసి భక్తులు తెచ్చిన పాలను తాగడంతో ఉత్సవం ముగిసింది. పెళ్లి కాని యువతి, యువకులు తమకు త్వరగా పెళ్లి జరిపించాలని, కొత్త దంపతులు సంతానం కలగాలని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కాపులే కాక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


ఉత్సవానికి హాజరైన గొల్లపల్లయ్య స్వామి


వర్క్ ఇన్‌స్పెక్టర్ల వక్ర బుద్ధి

- రూ.8.5 లక్షలు కొల్లగొట్టేందుకు కుట్ర
- డీఈ, ఏఈ సంతకం లేకుండా నోటీసు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు వక్ర బుద్ధి ప్రదర్శించారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ఏకంగా రూ.లక్షలు కొల్లగొట్టాలని చూశారు. విషయం నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి వెళ్లడంతో వారిని సర్వీసు నుంచి తొలగించే ప్రతిపాదనను తెరపైకి తీసుకురాగా.. 'తెలుగు తమ్ముళ్ల' ఆశీస్సుల కోసం వర్క్ ఇన్‌స్పెక్టర్లు ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఇదీ సంగతి:

నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ విభాగంలోని నీటి సరఫరా విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు పోతులయ్య, సంజీవరాయుడు పని చేస్తున్నారు. కమర్షియల్ పన్నుకు సంబంధించి ఇటీవల వీరిద్దరూ కలసి ఓ అరియర్ నోటీసును సిద్ధం చేశారు. డోర్ నంబర్ 17–1–169కు సంబంధించి పీ శ్రీరామిరెడ్డి, పీ హనుమంత్ రెడ్డి, పీ నారాయణ రెడ్డిల పేరు మీద ఉన్న వివిధ అసెస్‌మెంట్లకు అరియర్ చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. 2024 మార్చిలో రూ.35,155, అదే ఏడాది సెప్టెంబర్‌లో రూ.2,04930, 2025 మార్చిలో రూ.2,04930, ఇదే ఏడాది సెప్టెంబర్‌లో రూ.2,04930, వచ్చే నెలకు సంబంధించి రూ.2,04930 మొత్తం రూ.8,53,875 (8.5లక్షలు) చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. డీఈ, ఏఈ, కమిషనర్ల సంతకం లేకుండానే రూ.లక్షలు ఏవిధంగా చెల్లించాలంటూ అసెస్‌మెంట్‌దారులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. విషయం నగరపాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్ దృష్టికి రావడంతో ఆయన అవాక్కయ్యారు. సాధారణ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఈ స్థాయిలో వ్యవహరించడమేమిటని ఆరా తీయగా, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పోతులయ్య, సంజీవరాయుడు అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది. కాగా వీరిద్దరినీ సర్వీసు నుంచి తొలగించే ప్రతిపాదనను కమిషనర్ బాలస్వామి దృష్టికి తీసుకెళ్లారు.


రూ.8.5 లక్షల అరియర్ పన్ను చెల్లించాలని వర్క్ ఇన్‌స్పెక్టర్లు సిద్ధం చేసిన నోటీసు

లోతుగా విచారిస్తే..

నీటి సరఫరా విభాగంలో పోతులయ్య, సంజీవరాయుడుతో పాటు మరో ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరంతా ఓ టీంగా ఏర్పడి నగరపాలక సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ అడ్డగోలు బాగోతాన్ని విజిలెన్స్ అధికారులకు అప్పగిస్తే మరి కొందరు ఇంటి దొంగలు బయటకు రావడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుంది.